కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు కష్టాలు

సనత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరితో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగింది. అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 27న తోరణాలు, జెండాలతో అత్యంత సుందరంగా అలంకరణ చేసి జెండాలను ఆవిష్కరించాలన్నారు. అనంతరం వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో జరిగే పార్టీ రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, కుర్మ హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, అరుణగౌడ్, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, కొలను బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేషన్‌రాజు, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో విశాల్ దివస్

అమీర్‌పేట: అమీర్‌పేట ప్రబంధక్ కమిటి గురుద్వారా సాహెబ్ ఆధ్వర్యంలో బైశాఖీ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. 326వ ఖల్సాపంత్ ఆవిర్భావ దినోత్సవ వైశాఖీ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన విశాల్ దీవస్ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం ఉదయం గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ర్యాలీగా అమీర్‌పేట ధరం కరం రోడ్డులోని గురుగోవింద్‌సింగ్ మున్సిపల్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. ర్యాలీకి సిక్కులు అడుగడుగునా స్వాగతం పలుకుతూ పూల వర్షం కురింపించారు. జంటనగరాలకు చెందిన సిక్కు సోదరులతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుండి వేల మంది భక్తులు హాజరయ్యారు.

మహనీయుల విగ్రహాలను శుభ్రం చేసిన నాయకులు

బౌద్ధనగర్: బౌద్ధనగర్‌లో మహనీయుల విగ్రహాలను ఆదివారం స్థానిక నాయకులు శుద్ధి చేశారు. డివిజన్‌లోని అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను శుద్ధి చేసి పాలాభిషేకం, పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. మహనీయుల విగ్రహాలను శుద్ధి చేసే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, వారిని స్మరించుకుంటూ దేశ భక్తిని అలవర్చుకోవాలని బీజేపీ నాయకురాలు మేకల కీర్తి అన్నారు. ఎస్సీ మోర్చా నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, నాగమణి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం

అడ్డగుట్ట: మట్టల ఆదివారాన్ని పురస్కరించుకొని సౌత్ లాలాగూడలోని సీఎస్‌ఐ క్రైస్ట్ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చర్చి పరిసరాల్లో భక్తి గీతాలను ఆలపిస్తూ ఊరేగింపు నిర్వహించారు. ప్రతీ ఏటా ఈస్టర్ పండుగకు ముందుగా వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని పాస్టర్ రెవరెండ్ జార్జ్ క్రిస్టోఫర్ వివరించారు. సీఎస్‌ఐ చర్చి నుంచి మెట్టుగూడ చౌరస్తా వరకు మట్టల ఆదివారం ర్యాలీని నిర్వహించారు.

సస్పెన్షన్ ఎత్తివేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ బిల్డింగ్ డివిజన్‌లో సూపరిండెంట్ ఇంజినీరింగ్ (ఎస్‌ఈ)గా పని చేసిన దేవిదాస్ తన పై రెండు సంవత్సరాల క్రితం విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని వీసీ ప్రొ.కుమార్‌ను కోరారు. క్యాంపస్‌లోని సి హాస్టల్ మరమ్మతుల్లో నాసిరకం రేకులు వాడినందుకు ఆయన్ను 2023 మార్చి 31న విధుల నుంచి సస్పెండ్ చేశారు. తన పై వివక్షతతో గత వీసీ ప్రొ.రవీందర్ విచారణ చేపట్టకుండా సస్పెండ్ చేశారని దేవిదాస్ పేర్కొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

బొల్లారం: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందరి వాడని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జే. రామకృష్ణ అన్నారు. అంబేద్కర్ జయంతి వారోత్సవాలలో కంటోన్మెంట్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు బొల్లారం, లాల్ బజార్, కార్ఖాన, పికేట్ లలో అంబేద్కర్ విగ్రహాలను శుద్ధి చేసి పాలాభిషేకం నిర్వహించారు. అంబేద్కర్ ఆశయ సాధనకు తాము పాటుపడతామని ప్రతినబూనారు.కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు జేవీ నర్సింగ్ రావు, ధనుంజయ్ చారి, టోపీ శంకర్, విజయానంద పాల్గొన్నారు.

తోటి సంఘం అభివృద్ధికి కృషి

కంటోన్మెంట్: తోటి సంఘం అభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తానని బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద అన్నారు. బొల్లారంలో నిర్వహించిన కంటోన్మెంట్ నియోజకవర్గ తోటి- మేదర సంఘం సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 ఏళ్ల క్రితం చేపట్టిన తోటి సంఘం కమ్యూనిటీ హాలు నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. బోర్డు అధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో బొల్లారం, యాప్రాల్, తవాయిపురా, తాడ్‌బంద్, హస్మత్‌పేట, బోయిన్‌పల్లి, పికెట్ ప్రాంతాలకు చెందిన తోటి సంఘం సభ్యులు, తోటి సంఘం ప్రతినిధులు అమృత్ రాజ్, కె. రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండే కాలం జర జాగ్రత్త

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు..

సనత్‌నగర్: అసలే 'మండే' కాలం..అగ్ని ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకునేందుకు ఆస్కారం ఉన్న ఈ కాలంలో ప్రజలు తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రతినిత్యం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించేందుకు సిబ్బంది సిద్ధమవుతున్నారు. వారోత్సవాల్లో భాగంగా రోజుకోక ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అగ్నిమాపక శాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు సనత్‌నగర్ ఫైర్ సిబ్బంది ఆ మేరకు ప్రణాళికలు రూపొందించారు. ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా అగ్ని ప్రమాదాలు జరక్కుండా చూడవచ్చన్న భావనలో ప్రజల్లోకి వెళ్లి వారికి ప్రత్యేక డెమో ఇవ్వనున్నారు. ప్రధానంగా గృహాలతో పాటు ఆస్పత్రుల్లో పాటించవాల్సిన అగ్ని నివారణ చర్యలపై దృష్టిసారించారు. అదే విధంగా పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల నిరోధానికి, గోదాముల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హోటల్‌లో బస చేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి అవగాహన తీసుకురావాలోనే యోచనలో ఉన్నారు. ఈ మేరకు సనత్‌నగర్ ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మెన్, ఇన్‌ఛార్జి ఫైర్ ఆఫీసర్ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నారు.

సరైన జాగ్రత్తలతోనే అగ్ని ప్రమాదాల నివారణ

సరైన జాగ్రత్తలు చేపట్టడం ద్వారానే అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా నివారించవచ్చని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారోత్సవాల సందర్భంగా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులు, సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, లీడ్ ఫైర్ ఆఫీసర్ రాజు, సిబ్బంది రాజశేఖర్, అర్జున్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అగ్ని మాపక వారోత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్.

అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయం

లాలాపేట: అగ్ని ప్రమాదాలు జరిగినపుడు ఫైర్ సిబ్బంది అందించే సేవలు అభినందనీయమని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. ఆదివారం తార్నాకలోని తన నివాసంలో టీటీయుసి రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డితో కలిసి ఏప్రిల్ 14 నుంచి 20 వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాన్ని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఓ రామకృష్ణారెడ్డి, ఎల్ ఎఫ్ గోవింద్, ఫైర్ మ్యాన్ రాజారెడ్డి,విజయభాస్కర్, రమేష్, ఉపేందర్ తదితరులున్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

'గాంధీ'లో నిల్చిపోయిన లిఫ్ట్

అరగంట పాటు రోగుల ఇబ్బందులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం లిఫ్ట ఆకస్మికంగా నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పేషెంట్ల సహాయకులు, ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన వారు లిఫ్టలో ఇరుక్కుపోయి అరగంట పాటు నరకయాతన అనుభవించారు. గాంధీ ఆసుపత్రిలో వసతుల కల్పనలో పాలనా యంత్రాంగం విఫలమవుతుందనే విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయి. తాజా సంఘటన అందుకు బలం చేకూర్చుతోంది. ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆకస్మిక తనిఖీ తర్వాత కూడా పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు కనిపించడం లేదు అనేది వాస్తవం. సమస్యలతో రోగులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. గాంధీ ఆసుపత్రిలోని లిఫ్టులు గత కొంతకాలంగా తరచూ మొరాయిస్తుండటంతో అటు పేషెంట్లు, ఆసుపత్రికి వచ్చే ప్రజలు, రోగుల సహాయకులు, డాక్టర్లు, సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు లిఫ్టులు మధ్యలోనే ఆగుతూ లోపల ఉన్న వారికి చుక్కలు చూపెడుతున్నాయి. గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు గాంధీ ఆసుపత్రి మెయిన్ బిల్డింగ్‌లోని పేషంట్లు వినియోగించే లిఫ్ట లోని 4వ నెంబర్ లిఫ్ట లో 15 మంది గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఆరవ ఫ్లోర్‌కు వెళతున్నారు. అయితే ఆరవ అంతస్తు రాకముందే మధ్య లో సాంకేతిక సమస్య కారణంగా లిఫ్ట ఆగిపోయింది. లిఫ్ట ఆగిపోవడంతో అందులోని వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. లోపల ఉన్న అలారాన్ని పలు మార్లు నొక్కడంతో లిఫ్ట మధ్య లోనే ఆగిపోయిందన్న విషయాన్ని గ్రహించిన సెక్యూరిటీ సిబ్బంది మెయింటెనెన్స్ నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. లిఫ్టలోని తమ వారి పరిస్థితి ఎలా ఉందోనని వారి బంధువులు బయట తీవ్ర ఆందోళనకు గురయ్యారు. టెక్నీషియన్ పైకి వెళ్లి మరమ్మతులు చేయగా దాదాపు అరగంట తర్వాత లిఫ్ట అరవ ఫ్లోర్‌కు వచ్చి ఆగింది. డోర్లు తెరుచుకోవడంతో లోపల ఉన్న 15 మంది బయటకు వచ్చి ఊపిరి పీల్చుకున్నారు.

ముదిరాజ్‌ల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తాం

రాంగోపాల్‌పేట్: ముదిరాజ్ కార్పొరేషన్ ద్వారా ముదిరాజ్‌లందరు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా తోడ్పాటునందిస్తామని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని టివోలి గార్డెన్‌లో జరిగిన తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టు సంఘం కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్ కులస్తుల కోసం ముదిరాజ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందని.. దీన్ని ముదిరాజ్‌లు సద్వినియోగం చేసికోవాలని ఆయన సూచించారు. అనంతరం చైర్మన్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ముదిరాజ్ జర్నలిస్టు సంఘం గౌరవ అధ్యక్షులు బలరాం, అధ్యక్షులు చింతల నీలకంఠం ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, శ్రీశైలం పాల్గొన్నారు.



ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ను సత్కరిస్తున్న సంఘం నాయకులు

అనాథాశ్రమానికి నిత్యావసరాల పంపిణీ



సాక్షి, సిటీబ్యూరో: సమాజంలో ప్రతి ఒక్కరూ అనాథలకు, అనాథాశ్రమాలకు అండగా నిలవాలని మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటిఫుల్ ఫౌండర్ కిరణ్మయి అలివేలు పిలుపునిచ్చారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీ కింద పలు కార్యక్రమాలకు ఆమె శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్‌లోని బ్లిస్ హౌస్ ఫర్ గర్ల్స్ అనాథాశ్రమాన్ని సందర్శించి వారికి నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇటీవలే నిర్వహించిన మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటిఫుల్ కాంటెస్ట్ లో పాల్గొన్న వారితో పాటు ఇతన నిర్వాహకులతో కలిసి నిత్యావసర సరుకులు అందజేశారు. కార్పొరేట్ స్థాయిలో ఉన్న తాము ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నట్టు కిరణ్మయి అలివేలు చెప్పారు. తమ అనాథాశ్రమాన్ని సందర్శించిన మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటిఫుల్ ప్రతినిధులకు బ్లిస్ హౌస్ ఫర్ గర్ల్స్ అనాథాశ్రమం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఓయూలో ఘనంగా బీపీ మండల్ వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బీపీ మండల్ 43వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఐఏఎస్ అధికారి చిరంజీవులు ముఖ్యఅతిథిగా హాజరై బీపీ మండల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులతో పాటు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి వేడుకల ఆహ్వాన పత్రం

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ ఐడిహెచ్ కాలనీలో ఈ నెల 14న జరిగే డాక్టర్ అంబేడ్కర్ జయంతి వేడుకలకు రావాలని కోరుతూ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అహ్వాన పత్రాన్ని నిర్వాహకులు అందజేశారు. ఐడిహెచ్ కాలనీ నాయకులు వెంకటేషన్ రాజు, వినోద్, శివ, గజ్జెల శ్రీనివాస్ , మల్లేష్, మహేష్ తదితరులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అహ్వాన పత్రాన్ని అందజేసి అహ్వానించారు. ప్రతి ఏడు లాగే ఈ సంవత్సరం కూడా డాక్టర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

బన్సీలాల్‌పేట్: అధికారంతో నిమిత్తం లేకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాతామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పద్మారావునగర్ పార్కులో ఆదివారం స్థానిక కార్పొరేటర్ కె. హేమలత, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడి బాల్‌రెడ్డిలతో కలిసి 8 నూతన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని ఆరోపించారు. పద్మారావునగర్ పార్కు అభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. అనంతరం పార్కు బయట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు లాయక్, ఈసీ రావు, క్రిష్ణారావు, జీకే రావు పాల్గొన్నారు.

ఘనంగా పామ్ డే

రాంగోపాల్‌పేట్: క్రైస్తవులు మట్టల ఆదివారం (ఫాల్మ్ సండే)ను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈస్టర్ పండుగకు ముందు వచ్చే ఆదివారం పామ్ సండేగా ఆచరిస్తూ మట్టలు చేత పట్టుకుని పుర వీధుల్లో తిరగడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ క్లాక్ టవర్ ప్రాంతంలోని సీఎస్‌ఐ వెస్లీ చర్చిలో క్రైస్తవులు మట్టలు చేతిలో పట్టుకుని పాటలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. చర్చి నుంచి పాస్‌పోర్టు కార్యాలయం, సెయింట్ మేరీస్ రోడ్ మీదుగా చర్చి వరకు ర్యాలీ కొనసాగింది.



లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలోని పలు చర్చిల ఆధ్వర్యంలో ఆదివారం పామ్ సండే(మట్టల ఆదివారం) వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బెత్లహేమ్ ఎవాంజలికల్ బాప్టిస్టు చర్చి పాస్టర్ ఆచార్య అహరోన్ తీగుళ్ల, లోగోస్ గాస్పల్ చర్చి పాస్టర్ రెవరెండ్ సుదర్శన్, ఏలిషమ్మ, క్రైస్తవులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే సిఖ్ ఫౌండేషన్‌కు స్థలం



అమీర్‌పేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం సిఖ్ ఫౌండేషన్ కోసం ముడు ఎకరాల స్థలం కేటాయించిందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. అమీర్‌పేటలో నిర్వహిస్తున్న బైశాఖీ 326వ ఖల్సాపంత్ ఆవిర్భావ దినోత్సవ బైశాఖీ వేడుకలకు మాజీ మంత్రి,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి హాజరయ్యారు.మధ్యాహ్నం గురుద్వారాలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. గురుగోవింద్‌సింగ్ స్టేడియంలో జరిగిన విశాల్ దీవస్ కార్యక్రమంలో పాల్గొని సిక్కు సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సిఖ్ ఫౌండేషన్ కోసం స్థలం కేటాయించినప్పటికి కొన్ని కారణాల వలన ఆగిపోయిందన్నారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు ఎన్.శేషుకుమారి పాల్గొన్నారు.

బీజేపీతోనే బలహీన వర్గాల అభ్యున్నతి

కంటోన్మెంట్: భారతీయ జనతా పార్టీ బడుగు, బలహీనవర్గాలకు అభ్యున్నతికి పాటుపడుతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భానుక మల్లికార్జున్ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ఆరోవార్డులో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి రోడ్లు ఊడ్చారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ అంబేద్కరిజాన్ని నిబద్ధతతో అమలు చేస్తున్న పార్టీ బీజేపీ మాత్రమే అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఆరోవార్డు అధ్యక్షుడు ప్రతీక్ జైన్, నేతలు, రవీందర్ రెడ్డి, మన్ మోహన్, వెంకట చారి, రాజు, ప్రభాకర్, శివ, హరి తదితరులు పాల్గొన్నారు.



అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు వినతిపత్రం అందిస్తున్న పూలే ఫ్రంట్ ప్రతినిధులు

సికింద్రాబాద్: తెలంగాణ శాసనసభ ఆవరణలో బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితకాలపు సేవలు అందించిన మహనీయుడు జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని యునైటెడ్ పూలే ఫ్రంట్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం మాజీమంత్రి. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్రంట్ ప్రతినిధులు మాట్లాడుతూ అసెంబ్లీ ప్రాంగణంలో పూలే విగ్రహం ఏర్పాటు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి ప్రతినిధులు బోళ్ల శివశంకర్, ఆలకుంట హరిబాబు, సంపత్‌కుమార్, నరేశ్, గోపు సదానంద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి



బన్సీలాల్‌పేట్: కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కారు పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. ఐద్వా నాయకురాళ్లు ఆదివారం బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్ సమీపంలో పెంచిన గ్యాస్ ధరలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా సెంట్రల్ సిటీ ఉపాధ్యక్షురాలు శారదా మాట్లాడారు. నిత్యం పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలు, చాలీ చాలని వేతనాలతో జీవిస్తున్న పేదలపై మోడీ సర్కారు గ్యాస్ ధరలను రూ. 50 పెంచి ఆర్థిక భాగం మోపిందన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ సంస్థలకు వరాలు ఇస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు విజయలక్ష్మీ, హేమలత, స్వరూప, లత, పూలమ్మ, కళావతి, నందిని, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

చందన అలంకరణలో బాలాంజనేయుడు

చిలకలగూడ : చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ 72వ జయంతి వార్షిక వేడుకలు రెండవ రోజైన ఆదివారం కొనసాగాయి. స్వామివారు చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మేళతాళాలు, బాజా భజంత్రీలు, వేదపండితులు మంత్రోచ్చారణ మధ్య సుప్రభాత సేవ, సింధూర అలంకరణ, నిజాభిషేకం, సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మరాఠీలకు రాజకీయ ప్రాతినిధ్యం కావాలి



సాక్షి, సిటీబ్యూరో: కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకోవడం మాని స్థానిక మరాఠీలకు కూడా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని భారతీయ మరాఠా మహాసంఘ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సికింద్రాబాద్‌లో ఆదివారం సంఘం కార్యకర్తల సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి పదాధికారులను నియమించి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని అధికారికంగా జరపడంతో పాటు సెలవుదినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే తెలంగాణలో నివాసముంటున్న 27 లక్షల మంది మరాఠీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని. కార్యక్రమంలో భారతీయ మరాఠా మహా సంఘ జనరల్ సెక్రటరీ, అధికార ప్రతినిధి రాజన్ గావండ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గార్గె, రాష్ట్ర యువ అధ్యక్షుడు బాజీరావు బోస్లే, తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని బీజేపీ పాలించడం దురదృష్టకరం

రసూల్‌పురా: మతతత్వ బీజేపీ దేశాన్ని పరిపాలించడం దేశ ప్రజల దురదృష్ట మని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రెండవ వార్డు అధ్యక్షుడు శాంసన్‌రాజు ఆధ్వర్యంలో రసూల్‌పురా లోని పన్నెండు చర్చిల బిషప్‌లు, ఫాదర్ల నేతృత్వంలో ఆదివారం నిర్వహించిన మట్టల ఆదివారం ర్యాలీ, ఐక్యత సభ కార్యక్రమాన్ని సర్వే సత్యనారాయణ అన్నానగర్ చౌరస్తాలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ అని దేశాన్ని 60 ఏళ్ళు ఎలాంటి మత కల్లోలాలు లేకుండా పరిపాలించిందని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, స్థానిక కాంగ్రెస్ నేతలు ముప్పిడి గోపాల్, రాజేష్ యాదవ్ పాల్గొన్నారు.



మట్టల ఆదివారం కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న సర్వే సత్యనారాయణ

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

సికింద్రాబాద్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. అంబేడ్కర్ జయంతి వేడుకలు పురస్కరించుకుని ఆదివారం బీజేపీ నాయకులు సీతాఫల్‌మండిలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా తమ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్, మాజీ మేయర్ బండ కార్తీకారెడ్డి పాల్గొన్నారు.



ఘనంగా సాధికారత ఉత్సవం

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ మహిళా అధ్యయన కేంద్రంలో ఆదివారం సాధికారత ఉత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ ప్రాధాన్యతను, సామాజిక సాధికారత సాధన కోసం సేవలందించిన మహనీయులైన బాబూజగ్జీవన్‌రామ్, జ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల స్ఫూర్తిని విద్యార్థి తరం అందుకోవడానికి సాధికారత ఉత్సవాన్ని అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల సంస్కృత ఆచార్యులు డాక్టర్ వెంకటేశ్వర్లు, కళాశాల ప్రాంతీయ అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కే రామాచారి తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయండి



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో టీచింగ్, నాన్‌టీచింగ్ ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఓయూ జేఏసీ ఛైర్మన్ కొత్తపల్లి తిరుపతి వినతి పత్రం సమర్పించారు. ఆదివారం ఓయూకు విచ్చేసిన మంత్రిని కలసి వినతి ఉద్యోగాలు భర్తీ చేయాలని వినతి పత్రం అందచేసిన్నట్లు తెలిపారు. పరిశోధక విద్యార్థులకు ఫెలోషిప్‌లు, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు అందచేయాలని కోరారు.